ఖరీఫ్ సాగుకు సమాయత్తం

మండలంలో 6717 ఎకరాల్లో వరి సాగుకు సన్నద్ధం

- ఇప్పటికే కొన్ని గ్రామాల్లో వేసిన వరి నారు
- మరికొన్ని గ్రామాల్లో నారు కోసం జల్లుతున్న ధాన్యం విత్తనాలు
- 'అన్నదాత సుఖీభవ' కోసం ఎదురుచూపులు

పద్మనాభం: అన్నదాతలు ఖరీఫ్ పంట సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఖరీఫ్‌లో ప్రధానంగా వరి పంట సాగు చేస్తారు. ఇందుకోసం అన్నదాతలు నారు వేస్తున్నారు. పద్మనాభం మండలంలో ఖరీఫ్‌లో 6715 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తారు. మండలంలోని కృష్ణాపురం, కురపల్లి, పాండ్రంగి, సామయ్యవలస, మునివానిపాలెం, మద్ది, తునిపాలం, బాందేవుపురం, విజయరాంపురం, రెడ్డిపల్లి, తునివలస, చిన్నాపురం, విజయానందపురం, ఐనాడ, బి.ఆర్.తాళ్లవలస, గెద్దపేట, కోరాడ, వెంకటాపురం, రౌతుపాలెం, రేవిడి గ్రామాల్లో ఈ పంట సాగు చేస్తారు. దీనికోసం రైతులు విత్తనాలు సమకూర్చున్నారు. సాంబ, సోనామసూరి రకాల విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో కొని సిద్ధం చేసుకున్నారు. కొన్ని గ్రామాల్లో నారు కోసం విత్తనాలు జల్లారు. విత్తనాలు చల్లి వారం రోజులు కావస్తోంది. నాటిన నారు ఎండిపోకుండా ఉండడానికి తడిపి కాపాడుకుంటున్నారు. విత్తనాలు జల్లిన మడిలో నారు పుట్టడానికి నీటితో తడుపుతున్నారు.



మద్దిలో రైతు భరోసా కేంద్రం నుంచి ధాన్యం విత్తనాలు తీసుకువెళ్తున్న రైతులు

మరికొన్ని గ్రామాల్లో రైతులు విత్తనాలు జల్లుతున్నారు.

గతేడాది అందని 'అన్నదాత సుఖీభవ'

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే 'అన్నదాత సుఖీభవ' పథకం'కింద ప్రతి ఏటా రైతుకు రూ.20,000 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చింది. కూటమి అధికారంలో వచ్చి ఏడాది దాటి పోతుంది. మొదట ఏడాది ఇవ్వకుండా రైతులకు పంగనామం పెట్టింది. ప్రస్తుత ఏడాది ఖరీఫ్‌కు సన్నద్ధం అవుతున్నా అన్నదాత సుఖీభవ పథకం కింద డబ్బులు ఇవ్వకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నువ్వు పంట కూడా పోవడంతో పెట్టుబడుల కోసం ఆందోళన చెందుతున్నారు. మరో పది రోజుల్లో వరి ఉబాలు వేయడానికి సిద్ధమవుతున్నారు. అన్నదాత సుఖీభవ పథకం రాకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులు, బ్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న రైతులు ఈ పథకం డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు.



తునిపాలంలో వరి ఆకు



మద్దితో నారు కోసం విత్తనాలు జల్లుతున్న రైతు



మద్దిలో వేసిన పచ్చిరొట్ట పైరు



కృష్ణాపురంలో మొలకల కోసం నీటితో తడిపిన నారు మడి

వైఎస్సార్‌సీపీ హయాంలో రైతుకు భరోసా

వరి పంట సాగు చేయడానికి రైతులకు ఎకరాకు సుమారు రూ.20వేలు పెట్టుబడి అవుతుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభంలో రైతులకు వరి పంట సాగు చేయడానికి పెట్టుబడుల కోసం రైతు భరోసా కింద డబ్బులు ఇచ్చేది. ఐదేళ్లు వైస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా, పీఎం కిసాన్ కింద ఏడాదికి రైతుకు 13,500 చొప్పున ఇచ్చింది. ఐదేళ్లు 7500 మంది రైతులకు రూ. 50,62,50,000 చెల్లించింది. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు, నువ్వు పంట ద్వారా ఆదాయం ఎకరం విస్తీర్ణంలో వరి పంట సాగు చేసుకోవడానికి సరిపోయేవి.



ప్రభుత్వం డబ్బులు వేస్తుందని చూస్తున్నాం

నేను రెండెకరాల్లో వరి సాగుకు నారు వేశాను. వారం రోజులైంది. మరో 14 రోజుల్లో నారు పూర్తిగా ఎదుగుతుంది. అప్పుడు ఉబాలు వేస్తాం. ఎకరా విస్తీర్ణంలో వరి పంట సాగు చేయడానికి రూ.20వేలు పెట్టుబడి అవుతుంది. నువ్వు పంట ద్వారా వచ్చిన ఆదాయంతో పాటు గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన రైతు భరోసా డబ్బులు ఎకరం విస్తీర్ణంలో వరి సాగుకు సరిపోయేవి. ఈ ఏడాది నువ్వుపంట కూడా పోయింది. అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు ప్రభుత్వం ఇంకా వేయలేదు. ఆ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నాం.

– బి.పాపారావు, రైతు, మద్ది



పెట్టుబడికి ఇబ్బంది పడుతున్నాం

నాకు రెండెకరాల భూమి ఉంది. ఆ భూమిలో వరిసాగు కోసం నారు వేశాను. మరో 15 రోజుల్లో ఉబాలు వేయాలి. పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి. గతేడాది కూడా ప్రభుత్వం అన్నదాత సుఖీభవ డబ్బులు ఇవ్వకపోవడంతో చాలా ఇబ్బంది పడ్డాం. ఈ ఏడాది కూడా ప్రభుత్వం ఇంకా ఆ పథకం డబ్బులు వేయలేదు, ఉబా వేసే లోపు వస్తాయని చూస్తున్నాం. రాకపోతే మళ్లీ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిందే. ప్రభుత్వం స్పందించాలి. మా రైతులకు పథకం డబ్బులు వెంటనే వేసి ఆదుకోవాలి.

– కె.పాపారావు, తునివలస

క్లుప్తంగా

16న 'లైమ్‌లైట్ అవార్డ్స్' ప్రదానం

కొమ్మాది: ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్స్ (విశాఖ) ఆధ్వర్యంలో ఈ నెల 16న ఎంవీపీలోని గాదిరాజు ప్యాలెస్‌లో ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ లైమ్‌లైట్ అవార్డ్స్–2025 ప్రదానం చేయనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి వెంకటేష్ ప్రకటనలో తెలిపారు. ప్రతిభావంతులైన కళాకారులు, టెక్నీషియన్లు, ఈవెంట్ రంగంలో అద్భుతమైన అనుభవం ఉన్న సీనియర్లకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు సందీప్ కుమార్, షరీఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నేడు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాలలో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6గంటలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందని స్థానిక పరిపాలన అధికారి రమేష్ రెడ్డి తెలిపారు. నగరానికి చెందిన శ్రీ రాజేశ్వరి కళామిత్ర కళాకారుల ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరుగుతుందన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీ, జేసీబీ సీజ్



సీజ్ చేసి జేసీబీ, లారీ

పద్మనాభం: మండలంలోని రేవిడి పంచాయతీ రౌతులపాలెంలో శనివారం అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు వాహనాలను పట్టుకుని సీజ్ చేసినట్టు పద్మనాభం పోలీసులు తెలిపారు. వివరాలివి.. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వుతున్న జేసీబీ, గ్రావెల్ తరలిస్తున్న లారీని పట్టుకుని సీజ్ చేసినట్టు పోలీసులు చెప్పారు. వీటిని తదుపరి చర్యల నిమిత్తం పద్మనాభం తహసీల్దార్‌కు అప్పగించామన్నారు.

ముగ్గురు యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్



కాపాడిన యువకులతో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో ముగ్గురు యువకులు కొట్టుకుని పోతుండగా లైఫ్‌గార్డ్స్ ప్రాణాలు కాపాడిన సంఘటన చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చెందిన ఐదుగురు యువకులు శనివారం సాయంత్రం రుషికొండ బీచ్‌కు వచ్చారు. కాసేపు సరదాగా గడిపిన అనంతరం స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో వీరిలో బి.శ్రీనివాసరావు, ఎం.రామ్, ఎ.శివ కొట్టుకుని పోతుండటంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ ఎస్.నూకరాజు, ఎం.అమ్మోరు చిన్న ప్పన్న, గురుమూర్తి, జి.దేవ గుర్తించారు. వారిని రక్షించి, తీరానికి తీసుకువచ్చారు. వారికి మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. లైఫ్‌గార్డ్స్ ను మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

ఘనంగా పాపాహోం రజతోత్సవం



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ బాగ్చీ , కోడె దుర్గాప్రసాద్

దాబాగార్డెన్స్: పోలీస్ రిజర్వ్ బ్యారెక్స్ ప్రాంగణంలో నడుస్తున్న పబ్లిక్ అండ్ పోలీస్ అసోసియేషన్ ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్ (పాపాహోం) 25వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్, పాపాహోం చైర్మన్ శంఖబ్రత బాగ్చీ, హోం వ్యవస్థాపకుడు కోడె దుర్గాప్రసాద్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పాపాహోం కమిటీ, విద్యార్థులు ఒక ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. అప్పుడే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందన్నారు. పాపాహోం వ్యవస్థాపకుడు కోడె దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వివిధ కారణలచే నిరాదరణకు గురైన బాల బాలికలను చేరదీసి, వారిని బాగు చేస్తే మంచి భవిష్యత్ కలిగి చక్కగా జీవిస్తారని, తద్వారా స్థిరపడతారని తెలిపారు. 25 ఏళ్లుగా చక్కని ఆశయాలతో పాపాహోం అభివృద్ధికి కృషి చేస్తున్న కమిటీ సభ్యులు, సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. డీసీపీ అజిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ పాపాహోం ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. పాపాహోం పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఎన్‌ఎంఎంఎస్ శిక్షణకు 120 మంది హాజరు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్లో ప్రారంభమైన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) ఉచిత శిక్షణ శిబిరానికి శనివారం 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. భీమిలి అర్బన్, రూరల్ పరిధిలోని చిట్టివలస, సంతపేట, చిన ఉప్పాడ, కాపులుప్పాడ, రేవిడి వెంకటాపురం, లక్ష్మీపురం హైస్కూళ్ల నుంచి ఈ విద్యార్థులు వచ్చారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఈ శిక్షణ సాగింది. నగరంలోని వీఎస్ కృష్ణా కళాశాల సూపరింటెండెంట్ జీవీ అప్పారావు విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. శిక్షణ సజావుగా సాగడానికి మైక్ అందించారు. ఉపాధ్యాయులు వైవీ రమణ, వంగపండు దుష్యంత్, శ్రీనివాస్, జగన్, భరత్ క్లాసులు నిర్వహించారు. నిర్వాహకులు, ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహనరావు, ప్రధానకార్యదర్శి రేఖ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో శిక్షణకు హాజరైన విద్యార్థులు

కంపు కొడుతోంది..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో పారిశుధ్య నిర్వహణ రోజురోజుకూ క్షీణిస్తోంది. దుర్గానగర్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇక్కడి అపార్టుమెంట్లు, గృహాలకు అవుట్‌లెట్ సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో మురుగంతా రోడ్డుపైకి చేరుతోంది. ఆ మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దుర్గంధంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగలు ఈగలతో, రాత్రి దోమలతో కంటిపై కునుకు కూడా కరువవుతోందని తెలిపారు. పారిశుధ్య నిర్వహణపై కమిషనర్, ఎమ్మెల్యే పలుమార్లు అసహనం వ్యక్తం చేసినా.. సంబంధిత అధికారుల్లో ఏ మాత్రం మార్పు రావడం లేదు. ఇదే రీతిలో పారిశుధ్య నిర్వహణ ఉంటే ప్రజలు రోగాల బారిన పడటం ఖాయమని ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



దుర్గానగర్‌లో నిల్వ ఉన్న మురుగు నీరు

బీచ్ పార్కులో బొమ్మలకు రంగులు



శిష్యులతో కూర్చున్న బుద్ధుడి విగ్రహానికి రంగులు వేసిన అనంతరం ఇలా..



రంగులు వేసిన డాల్ఫిన్స్ బొమ్మ

భీమునిపట్నం: భీమిలి బీచ్ పార్కులోని బొమ్మలకు అధికారులు కొత్తగా రంగులు వేయించారు. ఇక్కడ పార్కు మధ్యలో శిష్యులతో ఉన్న బుద్ధుడు, మత్స్యకారుడు, డాల్ఫిన్ బొమ్మలు ఉన్నాయి. పార్కుకు ప్రధాన ఆకర్షణగా నిలిచే ఇవి దెబ్బతినడంతో పాటు రంగులు వెలిసిపోయి, కళావిహీనంగా తయారయ్యాయి. సందర్శకుల విజ్ఞప్తులు, పత్రికల్లో కథనాలపై అధికారులు స్పందించారు. ఇటీవల ఈ బొమ్మలకు మరమ్మతులు చేయించి, రంగులు వేయించారు. దీంతో ఇవి కళకళలాడుతున్నాయి.

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం



మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: ఎండాడ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం జరగనున్న పార్టీ భీమిలి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ప్రతి కార్యకర్త, నాయకుడు క్రమశిక్షణతో పాల్గొని, విజయవంతం చేయాలని పార్టీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు కోరారు. ఆయన శనివారం మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా అందించిన సమాచారం మేరకు కార్పొరేటర్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ప్రతినిధులు, సర్పంచ్‌లు, పార్టీ మండల అధ్యక్షులు, అనుబంధ కమిటీల ప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

రూ. 3 కోట్ల ప్రభుత్వ స్థలం ఆక్రమణ

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండా పోతోంది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు పాగా వేసేయ్ అన్నట్లుగా ఉంది పరిస్థితి. ఎండాడ బీసీ కాలనీ సమీపంలో సర్వే నంబరు 1లో ఓ స్థానిక నాయకుడు రూ.3 కోట్లు విలువ చేసే 300 గజాల స్థలాన్ని దర్జాగా ఆక్రమించేశాడు. అంతేకాదు జీవీఎంసీ వాటర్ ట్యాంక్ నుంచి మంచినీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేసుకున్నాడు. ఇదంతా సచివాలయానికి కాస్త దూరంలో జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కానీ, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు కానీ చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇదే సర్వే నంబరులో ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, విలువైన ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.



ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం

తొలగించిన చెట్ల కొమ్మలు తరలించరా?

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సిబ్బంది శుక్రవారం నిర్వహణ పనుల పేరుతో పలు చోట్ల తొలగించిన చెట్ల కొమ్మలు అక్కడే వదిలేశారని సీనియర్ సిటిజన్ టీవీఆర్ బాబా తెలిపారు. రోడ్డుపై వదిలేసిన కొమ్మల కారణంగా రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. శనివారం సాయంత్రానికి కూడా తొలగించిన కొమ్మలు రోడ్డుపైనే ఉన్నాయని, అటు విద్యుత్ సిబ్బంది గానీ, ఇటు జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది గానీ తొలగించలేదన్నారు. ఆదివారం సెలవు కారణంగా సోమవారం వరకు ఈ ఎండిపోయిన చెట్ల కొమ్మలు రహదారులపై, ఇళ్ల మధ్య ఉండవలసిందేనా అని ప్రశ్నించారు. చెట్ల నుంచి తొలగించిన రోజే ఈ కొమ్మలను తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.



జ్యూట్‌మిల్లు రహదారిలో విద్యుత్ సిబ్బంది తొలగించిన చెట్ల కొమ్మలు

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సీతమ్మధార ప్రాంతానికి చెందిన బి.నాగేశ్వరరావు రూ.1,00,116 విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. అలాగే విజయవాడకు చెందిన డి.శ్రీనివాస అరవింద్‌వర్మ రూ.1,01,116వి రాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అధికారులు అందజేశారు.

లక్షలు వెచ్చించి.. వదిలేశారిలా..



డివైడర్‌పై వ్యాపారులు వేసిన చెత్త



బురదతో నిండిన డివైడర్

తగరపువలస: జీవీఎంసీ అభివృద్ధి పనుల పేరుతో సుమారు రూ.25 లక్షలు వెచ్చించి, ఆ తర్వాత పట్టించుకోకుండా వదిలేయడంతో తగరపువలస మెయిన్‌రోడ్డులోని డివైడర్ అస్తవ్యస్తంగా తయారైంది. చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రి నుంచి రాములమ్మ థియేటర్ వరకు ఉన్న ఈ డివైడర్ గతంలో 6 అంగుళాల పొడవు, అడుగున్నర వెడల్పు ఉండేది. అక్కడక్కడ వ్యాపారులు డివైడర్‌పై నాటిన మొక్కలు తప్ప జీవీఎంసీ ప్రత్యేకంగా నాటినవి దీనిపై ఏమీ లేవు. రెండేళ్ల క్రితం ఆధునీకరణ పేరుతో జీవీఎంసీ ఈ డివైడర్‌పై రూ.25 లక్షలు కుమ్మరించింది. 12 అంగుళాల పొడవు, రెండున్నర అడుగుల వెడల్పు చేసింది. అంతవరకు బాగానే ఉన్నా.. దీనిపై మొక్కలు నాటడం మరచిపోయింది. ఈ డివైడర్‌ను ఆధునీకరించక పోయి ఉంటే కనీసం ద్విచక్రవాహనాల పార్కింగ్‌కైనా అనువుగా ఉండేది. ప్రస్తుతం ఈ డివైడర్‌ను స్థానిక వ్యాపారులు డంపింగ్‌యార్డుగా వినియోగించుకుంటున్నారు. అంతేకాకుండా ఈ డివైడర్‌పై వ్యాపారాలు నిర్వహించుకునే చిరు వ్యాపారుల నుంచి ప్రైవేట్ మార్కెట్ యాజమాన్యం ఆశీళ్లు వసూళ్లు చేసుకునేందుకు ఉపయోగపడుతోంది. పైగా ఈ డివైడర్‌ను ఇష్టం వచ్చిన చోట తవ్వేస్తున్నా, పట్టించుకునేవారు లేకపోయారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించాలని, మొక్కలు నాటి డివైడర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



వర్షంనీరు నిల్వ ఉండటంతో నాచు పట్టి ఇలా..

శిథిలాలను తొలగించారు



జేసీబీ ద్వారా శిథిలాలను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో శిథిల భవనాల తొలగింపులో భాగంగా వదిలేసిన శిథిలాలను సిబ్బంది శనివారం తొలగించారు. రుషికొండ జంక్షన్ సమీపంలో శిథిలావస్థకు చేరుకున్న తుఫాన్ రక్షిత భవనాన్ని ఇటీవల అధికారులు తొలగించారు. ఈ క్రమంలో వాటి శిథిలాలను అక్కడే వదిలివేయడంతో ప్రమాదకరంగా మారింది. దీనిపై శనివారం సాక్షి దినపత్రికలో 'ఇలాగేనా శిథిల భవనాల తొలగింపు' శీర్షికతో ప్రచురించిన వార్తపై జీవీఎంసీ వర్క్స్ ఏఈ శ్రీనివాస్ స్పందించారు. జేసీబీని ఏర్పాటు చేసి ప్రమాదకరంగా ఉన్న శిథిలాలను సిబ్బందితో పూర్తి స్థాయిలో తొలగింపజేశారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ఫుట్‌బాల్ జూనియర్ బాయ్స్ క్యాంప్ ప్రారంభం నేడు

తగరపువలస: చిట్టివలస బంతాట మైదానంలో రాష్ట్ర ఫుట్‌బాల్ జూనియర్స్ క్యాంప్ ఆదివారం నుంచి ప్రారంభించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అక్కరమాని చినబాబు తెలిపారు. రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ సూచనల మేరకు ఈ నెల 22 వరకు ఈ క్యాంప్ జరుగుతుందన్నారు. క్యాంప్ ముగిసిన అనంతరం ఈ జట్టు మధ్యప్రదేశ్‌లో జరిగే పోటీలలో పాల్గొనుందన్నారు. చిట్టివలస పోలమాంబ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన అధ్యక్షుడు, సీనియర్ ఆటగాళ్లు బంతాట మైదానానికి వచ్చి సూచనలు ఇవ్వాలని చినబాబు కోరారు.

మార్మోగిన గోవిందనామం



శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. శ్రీవారి దర్శనానికి భక్తులు శనివారం అధిక సంఖ్యలో వచ్చారు. ముందుగా శ్రీవారి పాదాల వద్ద పూజలు చేసిన అనంతరం స్వామిని దర్శించుకున్నారు. అమ్మవార్లకు, హనుమకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన శ్రీవారి నామ సంకీర్తనలు, కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు



గ్రావెల్ తవ్వేస్తున్న కృష్ణాకాలనీ కొండవాలు ప్రాంతం

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కృష్ణాకాలనీ కొండ ప్రాంతంలో గ్రావెల్‌ను కొందరు ఇష్టానుసారం తవ్వేసి, తరలించుకుపోతున్నారు. ఇక్కడ కస్తూర్బా గాంధీ విద్యాలయం ఎదురుగా ఉన్న ఓ లేఅవుట్‌ను ఆనుకుని ఉన్న కొండవాలు ప్రాంతంలో రాత్రి వేళల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి పెద్ద ఎత్తున లారీలతో ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలింపు జరుగుతోంది. మరికొన్ని ప్రాంతాల్లోనూ గ్రావెల్‌ను తవ్వేసి, తరలిస్తున్నా అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంతో రోజూ ఈ తవ్వకాలు, తరలింపులు యథేచ్ఛగా జరిగిపోతున్నాయి. గ్రావెల్ తరలింపుపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవిని వివరణ కోరగా, దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భక్తులతో సింహగిరి కిటకిట



నీలాద్రిగుమ్మం వద్ద భక్తుల రద్దీ

సింహాచలం : సింహగిరి భక్తులతో కిటకిటలాడింది. రెండవ శనివారం సెలవురోజు కావడంతో విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గిరి ప్రదక్షిణరోజు 32 కిలోమీటర్లు ప్రదక్షిణ చేసి, సింహగిరిపైకి వెళ్లని పలువురు భక్తులు కూడా వచ్చారు. భక్తులతో దర్శన క్యూలు, ప్రసాద విక్రయశాల, కేశఖండనశాల, బస్సులు, అన్నప్రసాద భవనం కిటకిటలాడాయి.